సాక్షి
కాకినాడ
గురువారం | 14 | నవంబర్ | 2024



రూ.2 లక్షల విరాళం


తాళ్లరేవు: సుంకరపాలెంలో పునర్నిర్మిస్తున్న ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామివారి ఆలయంలో ధ్వజస్తంభం ఏర్పాటుకు కర్నీటి ఓంకార్ (జార్జీపేట) రూ.2 లక్షల విరాళం అందజేశారు.



600 సెల్‌ఫోన్ల రికవరీ

కాకినాడ క్రైం: దొంగతనానికి గురైన 600 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్టు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. వీటి విలువ రూ.78 లక్షలు అన్నారు.

35 వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం సాయంత్రం 35,615 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.70 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 4,100 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

రుణ పరిమితులపై ప్రతిపాదనలు

కాకినాడ సిటీ: వ్యవసాయ అనుబంధ రంగాల్లో పెట్టుబడి ఉత్పాదక వ్యయం, ధరల పెరుగుదల వంటి అంశాల ఆధారంగా 2025–26 సంవత్సరానికి రైతులకు అందించే రుణ పరిమితులను ప్రతిపాదించాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టెక్నికల్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ, ఉద్యాన, పట్టు, పాడి, మత్స్య కార్యకలాపాలు చేపట్టే రైతులకు ఉత్పాదక వ్యయం, రాబడులు ఆధారంగా బ్యాంకుల ద్వారా అందించే రుణపరిమితులను ఆయా శాఖల జిల్లా అధికారులు కమిటీకి వివరించారు. ఉత్పాదక వ్యయంలో కనీసం 60శాతం పంట రుణాలుగా అందించేందుకు ఆయా అంశాల కింద స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పరిమితులను కమిటీ నిర్ణయించింది. ప్రధానంగా వరి పంటకు సంబంధించి ఎకరాకు ఖరీఫ్‌లో రూ. 40 వేలు, రబీలో రూ. 42 వేలుగా నిర్ణయించారు. జిల్లాలో రైతులు పండించే వ్యవసాయ ఇతర వాణిజ్య పంటలకు, మత్స్యరంగంలో రొయ్యలు, చేపలు సాగుకు గత ఏడాది నిర్వహించిన పెట్టుబడి మొత్తాలను ఈ సంవత్సరం యథాతథంగా ఆమోదించారు. పశు సంవర్ధకశాఖ ద్వారా పశు కేసీసీ లబ్ధిదారులకు పాడి గేదెలకు రూ. 30 వేలు, పాడి ఆవులకు రూ.25 వేలు వర్కింగ్ క్యాపిటల్‌గా నిర్ణయించారు. కమిటీ నిర్ణయించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పరిమితుల ప్రతిపాదనల రాష్ట్ర కమిటీ ఆమోదానికి పంపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. డీసీసీబీ సీఈవో ఆర్‌వీ నరసింహారావు, వ్యవసాయశాఖ జేడీ ఎస్ విజయకుమార్, పశుసంవర్ధకశాఖ జేడీ ఎస్ సూర్యప్రకాశరరావు, మత్స్యశాఖ జేడీ కరుణాకరణ, సెరికల్చర్ డీడీ బి గీతారాణి, హార్టికల్చర్ అధికారిణి కె శైలజ, ఎస్‌బిఐ డిప్యూటీ రీజనల్ హెడ్ నారాయణ, లీడ్ బ్యాంక్ అధికారులు, ఇతర బ్యాంకు అధికారులు, అభ్యుదయ రైతులు ఆర్ నవీన్‌కుమార్, కె మంగరాజు, డీసీసీబీ బ్యాంకు జీఎం ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

వరద బాధితులకు ఓఎన్‌జీసీ రూ.15 లక్షల విరాళం

కాకినాడ సిటీ: ఇటీవల సంభవించిన వరదల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం బాధితుల సహాయార్థం రూ.15 లక్షల విరాళాన్ని ఓఎన్‌జీసీ రెడ్ క్రాస్ సంస్థ ద్వారా ప్రకటించింది. ఈ విరాళాన్ని బుధవారం ఓఎన్‌జీసీ ఈవోఏ కాకినాడ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనుపమ్ సక్సేన, సీనియర్ ఎగ్జిక్యూటివ్ అన్వర్ షాదాబ్, రెడ్ క్రాస్ చైర్మన్ వైడి రామారావుతో కలిసి కలెక్టర్ షణ్మోహన్‌కు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో వరద బాధితుల సహాయార్థం విరాళాన్ని అందించడానికి రెడ్ క్రాస్ సంస్థతో కలిసి ముందుకు వచ్చిన ఓఎన్‌జీసీ అధికారులకు, రెడ్‌క్రాస్ చైర్మన్‌కు కలెక్టర్ షణ్మోహన్ కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి నామినేషన్

కాకినాడ సిటీ: తూర్పు–పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ద్రాక్షారామకి చెందిన గంధం నారాయణరావు బుధవారం కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్‌ను ఉమ్మడి తూర్పు–పశ్చిమ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ షణ్మోహన్ సగిలికి అందజేశారు.

108 ఉద్యోగుల సమ్మె నోటీసు

కాకినాడ సిటీ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 25వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు 108 ఉద్యోగుల సంఘం నాయకులు బుధవారం డీఆర్వో వెంకటరావుకు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరసింహ నాయక్‌లను కలిసి సమ్మె నోటీసులు అందించారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా 108 నిర్వహణ సంస్థలు మారుతున్నాయన్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన ఆర్జిత సెలవులు, గ్రాడ్యుటీ, పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించకుండా ఎగ్గొడుతున్నారన్నారు. అంబులెన్స్‌లు రిపేరుకు ఉద్యోగుల జీతాల నుంచి కోత పెడుతున్నారన్నారు. సరిపడా సిబ్బంది లేక సెలవులు మంజూరు చేయకుండా ఉద్యోగి వ్యక్తిగత జీవితాన్ని హరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోజుకు 12 గంటలు పని చేయించుకుంటూ కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తూ అదనపు పనికి అదనపు వేతనం చెల్లించడంలేదన్నారు. వీటిపై ప్రభుత్వ ఉన్నతాధికారులకు అనేక దఫాలుగా వినతి పత్రాలు అందించినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో సమ్మెకు వెళ్లాల్సిన పరిస్థితులను రాష్ట్ర ప్రభుత్వమే కల్పించిందని విమర్శించారు. 108 వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించి, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పెండింగ్ బిల్లులు, వేతనాలు ఆర్జిత సెలవులకు అరవింద సంస్థ నుంచి ఉద్యోగులకు చెల్లించే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వేతనాల స్లాబ్ విధానాన్ని అమలు చేయాలని, ప్రతి నెలా 5వతేదీ లోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యులు ఉదయ్‌భాను, ఆర్ శేఖర్, సూర్యచంద్ర పాల్గొన్నారు.

ఫిరాయింపుల్లో పద్మశ్రీ

- నమ్మి పదవిస్తే నమ్మక ద్రోహం
- పదవికి రాజీనామా ప్రకటన
- గన్‌మెన్, ప్రొటోకాల్ వదలరెందుకు?
- అధికారిక కార్యక్రమాల్లో ప్రత్యక్షం



కాకినాడలో చెత్త నుంచి బయోగ్యాస్ ఉత్పత్తి చేసే ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో కమిషనర్ భావనతో కలిసి ఎమ్మెల్సీ హోదాలో పాల్గొన్న పద్మశ్రీ (వృత్తంలో)

సాక్షి ప్రతినిధి, కాకినాడ: రాజకీయాల్లో నైతిక విలువలకు బొత్తిగా చోటు లేకుండా పోతోంది. నేతలు పార్టీలనే కాకుండా ఇచ్చిన మాటను, చేసిన ప్రకటనను కూడా ఫిరాయించేస్తున్నారు. అధికారం ఎటు వైపు ఉంటే అటే ఉంటామంటున్నారు. వైఎస్సార్ సీపీ ఎంతో నమ్మకం ఉంచి కాకినాడకు చెందిన కర్రి పద్మశ్రీకి గౌరవ ప్రదమైన శాసనమండలిలో స్థానం కల్పించింది. గవర్నర్ కోటాలో ఆమెకు మండలిలో సార్వత్రిక ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి ప్రాతినిధ్యం కల్పించారు. బీసీలలో పార్టీ ఆవిర్భావం నుంచి ఎంతోమంది సేవలందిస్తున్న సీనియర్‌లు ఉన్నప్పటికీ మత్స్యకార వర్గంలోని వాడబలిజ సామాజిక వర్గానికి చెందిన విద్యావంతురాలైన పద్మశ్రీని మహిళా కోటాలో అప్పటి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఎమ్మెల్సీగా పార్టీ అధిష్టానానికి సిఫారసు చేశారు. పద్మశ్రీ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యాక గత ఆగస్టు 30న కాకినాడ నగరపాలక సంస్థలో ఎక్స్ అఫిషియో సభ్యురాలిగా కొనసాగుతానని అప్పటి కలెక్టర్ కృతికాశుక్లాకు లేఖ అందజేశారు. ఎమ్మెల్సీగా ప్రమాణం చేశాక ఏడాది తిరగకుండానే పద్మశ్రీ ఎమ్మెల్సీ పదవికి, వైఎస్సార్ సీపీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే పద్మశ్రీ వైఎస్సార్ సీపీకి రాజీనామా చేశారు. పనులు చక్కబెట్టాలన్నా, లాబీయింగ్ చేయాలన్నా అధికార పార్టీలో ఉండాల్సిందేననే ధోరణితోనే ఎమ్మెల్సీ అటు వైపు ఫిరాయించారనే విమర్శలున్నాయి. పద్మశ్రీ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి రెండు నెలలు గడిచిపోయాయి. కారణాలేమైనా పదవులకు రాజీనామా చేసే ప్రజాప్రతినిధులు రాజీనామా చేసిన రోజు నుంచి అధికారిక హోదాను వదులుకుంటారు. రాజకీయాల్లో నైతిక విలువలు పాటించే వారెవరైనా ఇది అమలు చేస్తారు. అధికారంలోకి వచ్చిన అనంతరం తెలుగుదేశం సహా ఇతర పార్టీల నుంచి వైఎస్సార్ సీపీకి ఎవరు వచ్చినా పార్టీ, వారు అంతవరకూ అనుభవించిన పదవులకు రాజీనామా చేసి రావాల్సిందేనని ఆ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్మణ రేఖ గీశారు. ఆయా పార్టీల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులంతా దీన్ని పాటించే వైఎస్సార్ సీపీలోకి వచ్చారు.

విస్తుబోతున్న జనం

పద్మశ్రీ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా అంటే చేశారు తప్ప ఆ పదవి ద్వారా సంక్రమించిన గన్‌మెన్, ప్రొటోకాల్‌ను వదులుకోలేకపోతున్నారు. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు వంటి అధికారిక కార్యక్రమాలకు ఎమ్మెల్సీ హోదాలోనే హాజరవడంతో జనం విస్మయానికి గురవుతున్నారు. అక్టోబరు 21న పోలీసు అమరవీరుల దినోత్సవంలో ఎమ్మెల్సీ పద్మశ్రీ అధికారికంగా పాల్గొన్నారు. ఇటీవల కాకినాడ దుమ్ములపేటలో చెత్త నుంచి బయోగ్యాస్ ఉత్పత్తిచేసే ప్లాంట్‌కు శ్రీకారం చుట్టిన అధికారిక కార్యక్రమంలో ప్రొటోకాల్‌తో పద్మశ్రీ హాజరయ్యారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనలో మెకనైజ్డ్ బోట్ల యజమానులకు పరికరాల పంపిణీ కార్యక్రమంలో ప్రొటోకాల్‌తో పాల్గొన్నారు. పార్టీ వద్దనుకుని, ఎమ్మెల్సీ పదవి వద్దనుకుని రాజీనామా చేసినప్పుడు ఆ పార్టీ ద్వారా వచ్చిన ఎమ్మెల్సీ హోదాను ఎందుకు వదులుకోవడం లేదని పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు.

డబ్బుకు అమ్ముడుపోవడం అన్యాయం



డబ్బుకు అమ్ముడుపోవడం అన్యాయం. డబ్బుకు అమ్ముడుపోవడంతోనే ఎమ్మెల్సీ రాజీనామా చేశారు. ఇది అతి పెద్ద వెన్నుపోటు. రాజకీయాల్లో ఎంతోమంది పార్టీలు మారుతుంటారు. అయితే కర్రి పద్మశ్రీ, భర్త నారాయణ వ్యవహారశైలి అత్యంత దారుణం. సాధారణ వ్యక్తిని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీని చేసి గౌరవిస్తే చివరకు డబ్బుకు ఆశపడి రాజీనామా చేయడం అన్యాయం. ఎమ్మెల్సీగా రాజీనామా చేశానంటూనే అధికారిక కార్యక్రమాలకు ఎలా హాజరవుతున్నారు. గన్‌మెన్‌లను వెంట పెట్టుకు తిరుగుతున్నారు. ప్రొటోకాల్ ఎందుకు వదులుకోలేక పోతున్నారు.

– ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి,
మాజీ ఎమ్మెల్యే, కాకినాడ సిటీ

సముచిత గౌరవం కల్పించినా..

వైఎస్సార్ సీపీ మాత్రం ఎప్పుడూ నమ్మిన వారికి న్యాయం చేయడంలో ముందే ఉంటుంది. ఎస్సీ, బీసీలకు న్యాయం చేయడంలో వైఎస్సార్ సీపీ మొదటి నుంచి ఒక అడుగు ముందే ఉంటోంది. పార్టీలో విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచిన పిల్లి సుభాష్‌చంద్రబోస్‌కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి కీలకమైన రెవెన్యూ మంత్రిని చేసింది. అనంతరం ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో తొలిసారి బీసీల నుంచి బోస్‌ను రాజ్యసభ సభ్యుడిని కూడా చేసింది. వైఎస్సార్ సీపీని నమ్ముకున్న వారికి ఏదో ఒక రోజు సముచిత గౌరవం దక్కుతుందని కర్రి పద్మశ్రీకి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపిక చేయడం ద్వారా మరోసారి నిరూపితమైంది. పద్మశ్రీ భర్త కర్రి నారాయణకు పార్టీలో రాష్ట్ర స్థాయి పదవులతో సముచిత ప్రాధాన్యం కల్పించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాక పూర్వం నుంచి ద్వారంపూడి వెంట ఉన్న నారాయణకు, ఆ వర్గానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ కోసం ద్వారంపూడి సిఫారసు చేశారు. ద్వారంపూడి వెంట ఉన్న నారాయణ 2014లో టీడీపీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీతో చెట్టపట్టాలేసుకు తిరిగారు. తిరిగి వైఎస్సార్ సీపీలోకి వచ్చిన నారాయణను నమ్మి అతని భార్య పద్మశ్రీని ఎమ్మెల్సీని చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో అధికారం కూటమికి దక్కడంతో మరోసారి నారాయణ, భార్య ఎమ్మెల్సీ పద్మశ్రీ కూటమి వైపు వెళ్లిపోయారు. ఎంతో నమ్మకం ఉంచి ఎమ్మెల్సీ ఇస్తే విశ్వాస ఘాతుకానికి పాల్పడ్డారంటూ వైఎస్సార్ సీపీ శ్రేణులు మండిపడుతున్నాయి. అధికారం ఎక్కడ ఉంటే అక్కడే ఉంటామంటున్న నేతల జాబితాలో కర్రి దంపతులు చేరిపోయారంటున్నారు. ఎమ్మెల్సీ పద్మశ్రీ డబ్బుకు అమ్ముడుపోయి రాజీనామా చేసినట్టు మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి ఇటీవల చేసిన విమర్శలు రాష్ట్ర స్థాయిలో చర్చనీయాంశమయ్యాయి. సామాన్య స్థాయిలో ఉన్న పద్మశ్రీకి పార్టీ అత్యున్నతమైన పదవిని కట్టబెడితే డబ్బు కోసమే రాజీనామా చేసి ఉంటే అంతకంటే అన్యాయం మరొకటి ఉండదంటున్నారు.

సూపర్ సిక్స్‌కు మంగళం

- రూ.15వేల కోట్లు రాష్ట్రానికి కేంద్రం ఇస్తున్నది ఫండ్ కాదు అప్పు
- సీపీఎం జిల్లా నాయకులు డీఎస్ బాబ్జి



పిఠాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పిఠాపురం: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలకు మంగళం పాడిందని సీపీఎం జిల్లా నాయకులు డీఎస్ బాబ్జి ప్రజలకు వివరించారు. కేంద్రం రాష్ట్రానికి ఇస్తున్న రూ.15వేల కోట్లు ఫండ్ కాదు అప్పు అని ప్రజలు తెలుసుకోవాలని ఆయన సూచించారు. పార్టీ రాష్ట్ర కమిటీ ప్రజాపోరు పిలుపులో భాగంగా బుధవారం పిఠాపురం నండూరు ప్రసాదరావు భవనం నుంచి మార్కెట్ సెంటర్ మున్సిపల్ ఆఫీస్ వరకు కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఉప్పాడ బస్టాండ్ వద్ద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా తీసుకొస్తాం, సూపర్ సిక్స్ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తామని మాట ఇచ్చి అధికారంలోకి రాగానే పట్టించుకోవడం మానేశారని ఆయన విమర్శించారు. సూపర్ సిక్స్‌లో పెన్షన్ రూ.4వేలకు పెంచి మిగిలిన వాటిని వదిలేశారని ఆయన విమర్శించారు. మద్యం నేటికీ కూడా విచ్చలవిడిగా అధిక ధరలకు అమ్ముతూ ప్రజలు ఆరోగ్యాన్ని ఆస్పత్రుల పాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ విధానాన్ని తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. పిఠాపురం గవర్నమెంట్ హాస్పిటల్‌ను 100 పడకలగా తీర్చిదిద్దుతాం అని హామీ ఇచ్చారు, సిబ్బంది, శానిటేషన్, డాక్టర్స్, నర్సులు లేకుండా ఎలా అభివృద్ధి చేస్తారని ఆయన ప్రశ్నించారు. ట్రాఫిక్ నియంత్రణ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. నాయకులు కుంచే చిన్న, కోనేటి రాజు, కె.నాగేశ్వరరావు, మణి, విశ్వనాథం, జి వీరబాబు, రాజు, నందీశ్వరరావు పాల్గొన్నారు.

పూర్తి ఆయకట్టుకు నీరు

జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో నిర్ణయం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: జిల్లాలో గోదావరి తూర్పు డెల్టా, పిఠాపురం బ్రాంచి కెనాల్, ఏలేరు రిజర్వాయర్ వ్యవస్థల కింద 2024–25 రబీ సీజనులో ఫసలీ–1434 పంటల పూర్తి ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేసేందుకు జిల్లా సాగునీటి సలహా మండలి తీర్మానించింది. బుధవారం కలెక్టరేట్ వివేకానంద సమావేశపు హాలులో కాకినాడ జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఇరిగేషన్ ఎస్‌ఈ జి.శ్రీనివాస్, గోదావరి, ఏలేరు ఇరిగేషన్ వ్యవస్థలలో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వ పరిమాణాలను వివరించి, ఈ వ్యవస్థల కింద పూర్తి ఆయకట్టుకు రబీ సీజనులో సాగునీరు అందించేందుకు తగిన నిల్వలు ఉన్నాయన్నారు. ఈ మేరకు తూర్పు డెల్టా పరిధిలోని 1,05,341 ఎకరాలు, పిఠాపురం బ్రాంచి కెనాల్ కంద 32,507 ఎకరాలు వెరసి 1,90,865 ఎకరాల ఆయకట్టుకు రబీ సాగునీరు అందించేందుకు ఆయన ప్రతిపాదించగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆమోదం తెలిపారు. వచ్చే డిసెంబర్ ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యే రబీ సీజనులో ఈ ఆయకట్టుల రైతులు డిసెంబర్ 31వతేదీ నాటికి నాట్లు వేసుకుని, 2025 మార్చి 31 లోగా పంటలను పూర్తి చేసుకోవాలని కోరారు. రబీ పంటలకు నీటి విడుదల లోపు జిల్లాలోని సాగునీటి వ్యవస్థల పటిష్టీకరణకు రూ.6 కోట్లతో మంజూరు చేసిన పనులన్నింటినీ పూర్తి చేసి బిల్లులు ఆమోదానికి సమర్పించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా జిల్లాలోని సమ్మర్ స్టోరేజిలన్నింటిని డిసెంబరులో ఒకసారి, మార్చిలో మరోసారి పూర్తి స్థాయికి నింపాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, పెద్దాపురం ఆర్డీవో కె శ్రీరమణి, పోలవరం ఎల్‌ఎంసీ ఎస్‌ఈ పి ఏసుబాబు, ఏలేరు ఇరిగేషన్ డివిజన్ ఈఈ జి.శేషగిరిరావు, వ్యవసాయశాఖ జేడీ ఎన్ విజయకుమార్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

సాగునీటి విడుదలకు అవకాశం లేదు

అత్యవసర పనులు, మరమ్మతుల దృష్ట్యా పంపా రిజర్వాయర్ కింద ఆయకట్టుకు ఈ రబీలో సాగునీటి విడుదలకు అవకాశం లేదని కలెక్టర్ జిల్లా షణ్మోహన్ అన్నారు. పోలవరం ప్రాజెక్టును సత్వరం పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంకల్పానికి అనుగుణంగా ఈ ప్రాజెక్టులో భాగమైన పుష్కర లిఫ్ట్ ఇరిగేషన్ పథకంలో పంపా రిజర్వాయర్‌కు ఎగువన అసంపూర్తిగా ఉన్న అక్విడెక్ట్ నిర్మాణాన్ని ఈ సీజనులో చేపడతామని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఇటీవల వరదల సమయంలో దెబ్బతిన్న పంపా రిజర్వాయర్ గేట్లకు ఈ సీజనులోనే మరమ్మతులు నిర్వహించి యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించేందుకు స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫండ్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలైన ఈ రెండు పనులను అత్యవసరంగా ఈ సీజనులోనే నిర్వహించాల్సిన దృష్ట్యా పంపా రిజర్వాయర్ ప్రాజెక్టు కింద ఆయకట్టుకు ఈ రబీ సీజనులో సాగునీటి విడుదల ఉండదని కలెక్టర్ తెలిపారు. రబీ సీజనులో రైతులు అపరాల సాగు మాత్రమే చేపట్టాలని పంపా ఆయకట్టు రైతులను కోరారు.



నడకుదురు–పెనుగుదురు మధ్యలో రోడ్డుపక్కన ఉన్న ఎమ్మెల్యే ఫ్లెక్సీ

• ఇదేం ఫ్లెక్సిబులిటీ!



కొరిపల్లి సమీపంలో రోడ్డుపక్కన ఉన్న ఎమ్మెల్యే ఫ్లెక్సీ

కరప: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నట్టా, లేనట్టా అని ప్రజలకు సందేహం కలుగుతోంది. కరప మండలంలో ఎన్నికల కోడ్ అమలుల్లోకి వచ్చిన నాలుగు రోజులకు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. మొక్కుబడిగా అక్కడక్కడా రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 85 శాతం అధికారులను బదిలీ చేసి, వారి స్థానంలో తమకు అనుకూలంగా వ్యవహరించే అధికారులను నియమించుకున్నారు. బదిలీపై మండలానికి వచ్చినందుకు ప్రతిఫలంగా ఎన్నికల కోడ్ తూతూ మంత్రంగా అమలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు తమ స్వామిభక్తిని పక్కనపెట్టి అన్ని రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించాలని జనం కోరుతున్నారు.

అర్థ బలం
సంఘ బలం

ఉమ్మడి లక్ష్యసాధనకు పరస్పరం సహకరించుకొనేలా ఏర్పాటైన సహకార సంఘాలు అన్నదాతలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. ఒక్క వ్యవసాయానికే కాక రైతుకు ఏ అవసరం వచ్చినా రుణం అందించేందుకు సిద్ధంగా ఉంటున్నాయి. దీంతో అధిక వడ్డీలు గుంజే ప్రయివేటు బ్యాంకుల జోలికి పోకుండా రైతులు సహకార సంఘాల తలుపు తడుతున్నారు.

- రైతు రుణాలకు కేరాఫ్ సహకార సంఘాలు
- కావాల్సిన అన్ని రకాల రుణాలు లభ్యం
- జిల్లాలో మొత్తం సహకార సంఘాలు– 72
- రుణాలు పొందే రైతులు– 1.12 లక్షల మంది
- సంఘాల ద్వారా ఏడాదికి రూ.11 కోట్లకు పైగా ఆదాయం
- నేటి నుంచి ఈ నెల 20 వరకూ సహకార వారోత్సవాలు



సామర్లకోట మండలం నవర ప్రాథమిక సహకార సంఘం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఒకప్పుడు రైతులు ఆరుగాలం శ్రమించి పంటలు పండించి అమ్మగా వచ్చిన డబ్బు ప్రయివేటు వ్యాపారస్తులకు వడ్డీ కట్టేందుకు సరిపోయేది. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. రైతులకు ఏ రుణం కావాల్సి ఉన్న సహకార సంఘాల్లోనే ఇస్తున్నారు. రైతులకు కావాల్సిన బంగారు రుణాలపై అప్పులు, కేవలం 7 శాతం వడ్డీకే పంట రుణాలు, రైతు బిడ్డల పిల్లలకు కావాల్సిన విద్యారుణాలు సైతం సహకార సంఘాల ద్వారానే లభిస్తున్నాయి. ఒకప్పుడు రుణం కావాలంటే రైతులు అనేక ఇబ్బందులు పడేవారు. నేడు సహకార సంఘాల సిబ్బంది రైతులు ఇంటి వద్దకే వెళ్లి వారికి కావాల్సిన అన్ని రుణాలు స్వయంగా అందిస్తున్నారు. ప్రయివేటు బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకులను తీర్చిదిద్దారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సహకార బ్యాంకులను రైతులకు మరింత దగ్గరగా చేర్చింది. రైతుల పిల్లలు చదువుకొంటే వారికి విద్యారుణాలు అందించారు. పొలం కొనుగోలు చేసేవారికి సైతం రుణాలు అందించే ఏర్పాట్లు చేశారు. దీంతో రైతులు ఏ అవసరం వచ్చినా ఇతర బ్యాంకులకు వెళ్లకుండా సహకార బ్యాంకుల్లోనే రుణాలు తీసుకొనే ఏర్పాట్లు చేశారు.

అతి పురాతన సహకార వ్యవస్థ

కొంతమంది వ్యక్తులు కలిసి తమ అందరి బాగోగుల కోసం పనిచేయడాన్ని సహకారం (కో ఆపరేషన్) అంటారు. ఒక్కరు చేయలేని పనిని కొంత మంది కలిసి సాధించవచ్చు. ఇలా కొంతమంది కలిసి ఉమ్మడి లక్ష్యం కోసం ఉద్యమించడమే సహకారోద్యమం. ఇలా ఏర్పడిన సంఘాలను సహకార సంఘాలు అంటారు. దీనిలో భాగస్వాములైన వ్యక్తులకు కొన్ని నిర్దిష్టమైన ఆశయాలుంటాయి. సభ్యులు అందరికీ సమాన హక్కులు ఉంటాయి. అందరూ కలిసి కార్యక్రమాలు నిర్వహిస్తారు. సహకార సంఘాలు మొదట జర్మనీ దేశంలో స్థాపించారు. తర్వాత ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో సహకారోద్యమం ప్రారంభమయ్యింది. భారతదేశంలో 1904లో ఈ ఉద్యమం ప్రారంభమయ్యింది. వీటికి సహాయం చేయడానికి ప్రభుత్వంలో సహకార మంత్రిత్వశాఖలు ఏర్పాటు అయ్యాయి. రాష్ట్ర, జిల్లా స్థాయిలో వీటిని ఏర్పాటు చేశారు.

జిల్లాలో రైతులకు సంఘాల ద్వారా మేలు జరుగుతోంది ఇలా..

కాకినాడ జిల్లాలో 72 సహకార సంఘాలు ఉన్నాయి. ప్రతీ ఏడాది ఆయా సహకార సంఘాల ద్వారా 1.12 లక్షల మంది రైతులు రుణాలు పొందుతున్నారు. కాకినాడ జిల్లాలో సహకార సంఘాలు ఏటా రూ.11 కోట్లకు పైగా ఆదాయం సంపాదిస్తున్నాయి. ప్రతీ ఏడాది ఆదాయం పెరగడంతో రైతులకు కావాల్సిన అన్నీ రుణాలు అందించేందుకు వీలు అవుతోంది. సామర్లకోట మండలం నవర సహకార సంఘంలో 1,561 మంది సభ్యులు ఉన్నారు. రైతులకు అన్నీ రకాల రుణాలు అందిస్తున్నారు. ప్రతీ ఏడాది రూ.26 కోట్ల రుణాలు అందిస్తున్నారు. ఈ సంఘానికి రూ.56 లక్షల ఆదాయం వస్తోంది. ధాన్యం కొనుగోలు కమీషన్, రైతులు తీసుకున్న రుణాలపై వడ్డీ ద్వారా ఈ సంఘం లాభాలు ఆర్జిస్తోంది. దీంతో రైతులకు ఏ రుణం కావాలన్న ఇచ్చేందుకు సొసైటీ ముందుకు వస్తోంది.

సంఘాలను ప్రోత్సహిస్తున్నాం



సహకార సంఘాలు లాభాలు పొందే విధంగా చర్యలు తీసుకొంటున్నాం. రైతులకు రుణాలు ఇవ్వడమే కాకుండా సహకార సంఘాల ద్వారా మెడికల్ షాపులు, పెట్రోల్ బంకులు వంటివి ఏర్పాటు చేసే విధంగా సహకార సంఘాలను ప్రోత్సహిస్తున్నాం. ప్రభుత్వం సహకార సంఘాల ద్వారా స్థానికంగా గొడౌన్‌లు నిర్మించేందుకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తుంది.

– జి.వెంకటకృష్ణ,
జిల్లా సహకారశాఖాధికారి

నేటి నుంచి సహకార వారోత్సవాలు

కాకినాడ జిల్లాలో ఈ నెల 14 నుంచి 20 వరకూ సహకార వారోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు సహకార శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. సహకార సంఘాల్లో నిర్వహించే కార్యక్రమాల షెడ్యూల్ విడుదల చేశారు. ఈ నెల 14న సహకార మంత్రిత్వశాఖ నూతన కార్యక్రమాల ద్వారా సహకార ఉద్యమాన్ని బలోపేతం చేయడం, 15న సహకార సంఘాల్లో నూతన ఆవిష్కరణలు, సాంకేతికత, సుపరిపాలన, 16న వ్యవస్థాపకత, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడంలో సహకార సంఘాల పాత్ర, 17న సహకార సంఘాలు వ్యాపార ప్రాయోజిత సంస్థలుగా రూపాంతరం, 18న సహకార సంఘాల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం, 19న మహిళలు, యువత, బలహీన వర్గాల కోసం సహకార సంఘాలు, 20న సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో, మెరుగైన ప్రపంచ నిర్మాణంలో సహకార సంస్థల పాత్ర అంశాలపై సహకార వారోత్సవాలు నిర్వహించాలని ఉన్నతాధికారులు సంఘాల సీఈఓలకు ఆదేశాలు జారీ చేశారు.